పీఆర్‌సీ కమిషన్ నియమించాలి



కాగజ్‌నగర్ : ప్రభుత్వం పీఆర్‌సీ కమిషన్ నియమించి 32 శాతం ఐఆర్ ప్రకటించాలని పీఆర్‌టీయూటీఎస్ మండల అధ్యక్షులు ఎనగంటి భిక్షపతి కోరారు. శుక్రవారం స్థానిక జెడ్పీఎస్ఎస్ బాలికలు, సర్‌సిల్క్ జెడ్పీఎస్‌-ఎస్ బాలురు, పెట్రోల్‌పంపు, చింతగూడ ఉన్నత పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పత్తిపాక శ్రావణ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనుదినం జనపక్షం
www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్

శనివారం 19 ఆగస్టు 2023

ఉత్తమ వైద్యులుగా ఆర్ఎంఓ వేణుగోపాల్



లక్ష్మణచాంద : నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ వేణుగోపాల్‌కృష్ణ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేతుల మీదుగా స్వాతంత్ర్య దినోత్సవం రోజు ఉత్తమ డాక్టర్ పురస్కారం పొందారు. ప్రయివేట్ ప్రాక్టీస్ లేకుండా ఎల్లప్పుడు ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలందిస్తూ ప్రజల మన్ననలు అందుకుంటున్నారని మంత్రి అభినందనలు తెలిపారు. వైద్య రంగంలోనే కాకుండా సాహిత్యం, కళా, చిత్ర రంగంలో కూడా సేవలందిస్తున్నారని కొనియాడారు. ఉత్తమ పురస్కారం పొందిన వేణుగోపాల్‌కు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందనలు తెలిపారు.

గృహలక్ష్మీ ఎవరిని వరించేనో..?

- రేపటితో ముగియనున్న పరిశీలన గడువు
- సొంతింటి కోసం భారీగా వచ్చిన దరఖాస్తులు
- తొలి విడతలో నియోజకవర్గానికి 3వేలు మాత్రమే
- లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం

సొంతింటి కోసం దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న లబ్ధిదారుల కల నెరవేరే సమయం ఆసన్నమైంది. సొంతింటి నిర్మాణం కోసం ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం ఇది వరకే లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. ఈ నెల 15వ తేదీ నుంచి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న అధికారులు అర్హులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ నెల 20వ తేదీతో పరిశీలన ప్రక్రియ ముగిసిన తర్వాత తొలి విడత లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు తెలిసింది. కానీ దరఖాస్తులు భారీగా రావడం.. ఇండ్ల కేటాయింపు సంఖ్య మాత్రం పరిమితంగానే ఉండటంతో తొలి విడతలో ఈ గృహలక్ష్మీ పథకం ఎవరిని వరిస్తుందోననే ఉత్కంఠ నెలకొంది. ఇంటి నిర్మాణం కోసం ఏండ్లుగా ఎదురుచూడటం.. ప్రభుత్వం మాత్రం పరిమితంగానే పంపిణీ చేయడం వంటి పరిణామాలు అర్హులైన లబ్ధిదారులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఎవరికి వస్తుందో తెలియక ఆందోళన చెందుతున్నారు. మరోపక్క ఇండ్ల ఎంపికలోనూ రాజకీయ జోక్యం చోటుచేసుకుంటుందనే ఆరోపణలున్నాయి. తమకు అనుకూలమైన వారికి ఇల్లు ఇప్పించేందుకు కొందరు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.



కొనసాగుతున్న గృహలక్ష్మీ లబ్ధిదారుల పరిశీలన

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

సొంతిళ్లలేని పేదలకు ఇంటి నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం గృహలక్ష్మీ పథకం కింద ఆర్థిక సాయం అందజేయాలని నిర్ణయించింది. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.3లక్షల చొప్పున మూడు విడతల్లో అందజేయనుంది. పునాది దశలో రూ.లక్ష, పైకప్పు దశలో మరో రూ.లక్ష, ఇంటి నిర్మాణం పూర్తయ్యాక ఇంకో రూ.లక్ష అందజేసేందుకు నిర్ణయించింది. తొలి విడతలో నియోజకవర్గానికి 3వేల మంది లబ్ధిదారులకు అందించనుంది. ముఖ్యంగా ఖాళీ స్థలం ఉండి ఇల్లు లేని వారికి, పెంకుటిల్లు, పూరిగుడిసె, రేకులషెడ్డు, శిథిలావస్థలో ఉన్న ఇండ్లు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత కింద ఎంపిక చేయనున్నారు. ఇందుకు ఈ నెల 8తేదీ నుంచి 10వ తేదీ వరకు మూడు రోజుల పాటు దరఖాస్తులను స్వీకరించిన అధికారులు ఈ నెల 15వ తేదీ నుంచి పరిశీలన చేపడుతున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో రెండు నియోజకవర్గాలు బోథ్, ఆదిలాబాద్‌తో పాటు ఖానాపూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గంలోనూ కొన్ని మండలాలున్నాయి. ఈ జిల్లాలో 7400 ఇండ్లను మంజూరు చేయగా వీటి కోసం 66,914 దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటి వరకు 26,215 దరఖాస్తులను పరిశీలించిన అధికారులు 17,856మంది అర్హులుగా ఉన్నట్లు తేలింది. మరో రెండు రోజుల పాటు పరిశీలన జరగనున్న దృష్ట్యా అర్హుల సంఖ్య మరింత పెరగనుందని అధికారులు చెబుతున్నారు. మిగితా మంచిర్యాల, నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లోనూ దరఖాస్తులు భారీగా వచ్చినట్లు తెలుస్తోంది. ఆయా జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోందని తెలిసింది.

ఎంపికలో రాజకీయ జోక్యం..?

గృహలక్ష్మీ పథకంలో భాగంగా లబ్ధిదారుల గుర్తింపులో రాజకీయ జోక్యం ఉందనే ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం పరిశీలన పూర్తయిన తర్వాత అర్హులను ఎంపిక చేసి అర్హుల జాబితాను జిల్లా కలెక్టర్‌కు పంపించనున్నారు. ఇక్కడ్నుంచి స్థానిక మంత్రికి జాబితా వెళ్లనుందని తెలుస్తోంది. స్థానిక ఎమ్మెల్యేల ద్వారా అర్హుల జాబితాలో తొలి విడత లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. పరిశీలనతో పాటు ఎమ్మెల్యేలు ఎంపిక చేయనున్న జాబితాలో తమ వారి పేర్లు ఉండేలా కొందరు మండల, గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకులు విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొందరు నాయకులు వారికి అనుకూలమైన లబ్ధిదారులకు ఇండ్లు ఇప్పిస్తామని భరోసా ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం అర్హుల గుర్తింపులోనూ అక్కడక్కడ స్థానిక అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో తొలివిడతలో తమకు స్థానం దక్కుతుందో లేదోనని అనేక మంది అర్హులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీర్ఘకాలికంగా సొంత ఇల్లు లేకుండా అద్దె ఇండ్లలో ఉండటం.. ఇరుకు గదుల్లో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. ఇండ్ల మంజూరు లేక గత పదేండ్లకు పైగా కావస్తుండటంతో అనేక కుటుంబాలు ఆపసోపాలు పడుతున్నారు. సొంతంగా నిర్మించుకునే స్థోమత లేక ప్రభుత్వ సాయంపైనే ఆధారపడి ఉన్నారు. ప్రభుత్వం తొలి విడతలో తక్కువగా కేటాయించడం.. అర్హుల సంఖ్య అధికంగా ఉండటంతో ఎవరికి వస్తుందో తెలియక అయోమయానికి గురవుతున్నారు.

అధికార పార్టీ అనుచరులకు లబ్ది కోసమే 'గృహలక్ష్మి'

- లబ్దిదారుల ఎంపికలో మంత్రి, ఎమ్మెల్యేల ప్రమేయమెందుకు?
- కలెక్టర్‌కే పూర్తి అధికారాలివ్వాలి
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

దొడ్డిదారిన అధికారపార్టీ అనుచరులకు లబ్ది చేకూర్చేందుకే సీఎం కేసీఆర్ గృహలక్ష్మి పేరుతో కొత్త పథకం తీసుకొచ్చాడని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. శుక్రవారం కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన గృహలక్ష్మి పథకం లొసుగులను వివరించారు. 2014-15లో రాష్ట్రంలో సమగ్ర కుటుంబ సర్వే ద్వారా సామాజిక వర్గాల వారీగా ఆర్థిక పరిస్థితులను తెలుసుకున్నారని, ఆ వివరాలను ఇప్పటి వరకు ఎందుకు బహిర్గతం చేయడం లేదని ప్రశ్నించారు. దళితబంధు, బీసీ బంధు, మైనారీ బంధులలో ఎలాగైతే అధికారపార్టీ అనుచరులను లబ్దిదారులుగా ఎంపిక చేశారో, ఇపుడు గృహలక్ష్మిలో కూడా వారినే ఎంపిక చేసే బాధ్యతను ఎమ్మెల్యేలు, మంత్రులకు ఇచ్చారని ఆరోపించారు. గృహలక్ష్మి లబ్దిదారుల ఎంపిక బాధ్యతను పూర్తిగా కలెక్టర్‌లకే అప్పగించాలని, పంచాయతీల వారీగా లబ్దిదారుల జాబితాలను పంచాయతీ కార్యాలయాలలో అంటించి గ్రామసభల నిర్వహణ ద్వారా లబ్దిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. 2014లో 2,72,000ల మందికి డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని రూ.18వేల కోట్లు కేటాయించిన సీఎం కేసీఆర్ ఇప్పటి వరకు కేవలం 50 వేల డబుల్ బెడ్ రూం ఇళ్లను మాత్రమే పంపిణీ చేశారని అన్నారు. ఇప్పుడు ఆ పథకం నీరుగారడంతోనే గృహలక్ష్మి అంటూ ప్రజలను ప్రతిపక్షాల వైపు చూడకుండా ఉండేందుకు కుట్ర పన్నుతున్నాడని ఆరోపించారు. ప్రస్తుతం నిర్మాణ వ్యయం పెరిగినందున ప్రభుత్వం ఇచ్చే రూ.3లక్షలు ఎటూ సరిపోవని, నిర్మాణానికి అయ్యే స్టీల్, సిమెంట్, ఇటుకలను ప్రభుత్వమే పూర్తి ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు.

సీఎం, హోంమంత్రిని భర్తరఫ్ చేయాలి

రాష్ట్రంలో మహిళలు, గిరిజనులపై రోజురోజుకు దాడులు పెరుగుతున్నాయని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మండిపడ్డారు. హైదరాబాద్‌లో పట్టపగలే హత్యలు జరుగుతున్నా, గిరిజన మహిళను పోలీసుస్టేషన్‌లో ఇటీవల చిత్రహింసలకు గురి చేసినా సీఎం, హోంమంత్రి నోరు మెదపడం లేదని అన్నారు. సిర్పూర్(టి) నియోజకవర్గంలో ఎమ్మెల్యే కోనప్ప అనుచరులే మట్కా, గుట్కా, స్నూకర్ లాంటి చీకటి కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని అన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే గ్యాంగ్‌లపై ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ కార్యదర్శి అర్షద్‌హుస్సేన్, రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, నాయకులు పిల్లల తిరుపతి, మహేష్, గౌతం పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటాలి

నస్పూర్: ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణలో భాగం కావాలని డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ జి వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డితో కలిసి జీఎం కార్యాలయం ముందు సెంట్రల్ నర్సరీని సందర్శించి, పెంచుతున్న మొక్కల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే నర్సరీలో పెంచుతున్న మొక్కలకు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను సూచించారు. మొక్కలను రక్షిస్తూ ఉండాలని, భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని ఇవ్వడానికి ప్రతి ఒక్కరూ మొక్కలను విరివిగా నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ జనరల్ మేనేజర్ బసివిరెడ్డి, ఎస్ఓ టూ జీఎం కె రఘుకుమార్, డీజీఎం సివిల్ శివరావు, ఫారెస్ట్ మేనేజర్ రమణారెడ్డి, ఎన్విరాన్మెంటల్ ఆఫీసర్ హనుమాన్‌గౌడ్ పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలకు కౌన్సెలింగ్

ఆదిలాబాద్‌టౌన్ : కారుణ్య నియామకాల ద్వారా ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగ నియామకాలకు కౌన్సెలింగ్ నిర్వహించామని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కారుణ్య నియామకాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఉద్యోగ నియామకాలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. హాజరైన 34మంది అభ్యర్థులలో 32 మందికి వివిధ శాఖల్లో జూనియర్ సహాయకులుగా ఉద్యోగం కల్పించామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, కలెక్టరేట్ పర్యవేక్షకులు రాంరెడ్డి, సిబ్బంది శ్రీధర్ పాల్గొన్నారు.

మహా సభల పోస్టర్ ఆవిష్కరణ

మందమర్రి : సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) 16వ రాష్ట్ర మహా సభల పోస్టర్‌లను శుక్రవారం కేకే ఓసీలో ఏఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25, 26, 27 తేదీలలో గోదావరిఖనిలో రాష్ట్ర మహా సభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్‌ని 1942లో శేషగిరి రావు, పాపయ్యలు స్థాపించిన అనంతరం విఠల్‌రావు 1962లో దీపావళి బోనస్, మనుబోతుల కొమురయ్య ఆధ్వర్యంలో 1998లో పెన్షన్ హక్కులు సాధించిన సంఘం ఏఐటీయూసీ అని, ఓడినా గెలిచినా కార్మికుల పక్షాన పోరాడే సంఘం ఒక్క ఏఐటీయూసీ మాత్రమేనని అన్నారు. ఈ మహాసభలకు కార్మికులు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మర్రి కుమారు యాదవ్, కోటయ్య, మల్లేష్, సారయ్య పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తిమ్మాపూర్ గ్రామపంచాయతీలో శుక్రవారం భవన నిర్మాణ కార్మికులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ అమూల్య గ్రామంలోని భవన నిర్మాణ కార్మికులకు150 మందికి ఉచితంగా రక్త మూత్ర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ జాడి గంగాధర్ ప్రారంభించారు. 52 రకాల వ్యాధులకు చికిత్సలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులందరూ తప్పనిసరిగా, లేబర్ కార్డుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి లావణ్య, వైద్య సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

సిర్పూర్(టి): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో భర్తీ కాకుండా మిగిలి వున్న సీట్లకు అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు జిల్లా కోఆర్డినేటర్ పోలోజు బాలరాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు అడ్మిషన్లు చేపడుతున్నట్టు తెలిపారు. సిర్పూర్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో ఎంఈసీ విభాగంలో ఎస్సీ విద్యార్థులకు 25, హెచ్ఈసీ ఒకటి, మైనార్టీ విద్యార్థులకు ఒకటి, సీఈసీ విభాగంలో ఎస్సీ విద్యార్థులకు ఏడు, హెచ్ఈసీ ఒకటి, మైనార్టీ ఒకటి, సిర్పూర్ బాలికల గురుకుల కళాశాలలో హెచ్ఈసీ విభాగంలో ఎస్సీలకు 12, హెచ్ఈసీ ఒకటి, మైనార్టీ ఒకటి, ఓసీ ఒకటి, కాగజ్‌నగర్ బాలికల గురుకుల కళాశాలలో ఎంపీసీ విభాగంలో ఎస్సీ ఏడు, హెచ్ఈసీ ఒకటి, మైనార్టీ ఒకటి, ఓసీ ఒకటి ఖాళీలు ఉన్నట్టు ఆయన తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 22 లోగా అన్ని ఒరిజినల్ సర్టిఫికేట్‌లతో నేరుగా కళాశాల పని దినాల్లో సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

లక్ష్మణచాంద : మండలంలోని వడ్యాల్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మత్తు పనులు జరుగుతున్న దృష్ట్యా శనివారం ఉదయం 9గంటల నుండి 1గంట వరకు వడ్యాల, రాచపూర్, కనకపూర్ గ్రామల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ మహేష్ తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సీపీఎఫ్ సేవలు అభినందనీయం

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్



నవతెలంగాణ-ఉట్నూర్

ఏజెన్సీ ప్రాంత రైతులకు సీపీఎఫ్ చేస్తున్న సేవలు అభినందనీయమని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. శుక్రవారం కేబీ కాంప్లెక్‌లోని సమావేశ మందిరంలో సీపీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన పనులపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంస్థ ప్రతినిధులతో పాటు పీఓ చాహత్ బాజ్‌పాయ్ పాల్గొన్నారు. ఈ ఎన్జీఓ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పీఓ పరిశీలించారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ రైతుల అభ్యున్నతికి సీపీఎఫ్ వివిధ రకాల ప్రాజెక్టులలో అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. సంస్థ ద్వారా జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, చేపట్టబోయే పనులను వివరించారు. గిరిజన రైతులను మరింత అభివృద్ధి చేసేందుకు మరిన్ని కార్యక్రమాలు అమలు చేయాలని సూచించారు. అందుకుముందు పీఓ రాకతో ఆదివాసీ మహిళ రైతులు సంప్రదాయ బద్దంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జైవంత్‌రావు, వివిధ శాఖల అధికారులు, సంస్థ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను ఆదుకోవాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం తొలిదశ ఉద్యమంలో 390 మంది, మలిదశలో 1400 మంది బలయ్యారని, వారి ఉద్యమ ఫలితంగా సాధించుకున్న తెలంగాణలో ఉద్యమకారులను విస్మరించడం సరికాదని 1969 తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అభిప్రాయపడింది. శుక్రవారం వారి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. ఉద్యమం కోసం విలువైన సమయాన్ని వృథా చేసుకొని విద్యా, ఉద్యోగ అర్హతలు కోల్పోయిన వారిని, జైలు శిక్షలు ఎదుర్కొన్న వారిని గుర్తించి వారికి పెన్షన్లు, ఇళ్లు, ఆర్థిక సహాయం అందించాలని తీర్మానించారు. ఈ సమావేశంలో ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు మార్త సత్యనారాయణ, బాధ్యులు నారాయణ, పి దేవయ్య, కలికోట రమణయ్య, మీర్ సాబీర్ అలీ, రవూఫ్ పాల్గొన్నారు.

స్వగ్రామానికి చేరిన రమేష్ మృతదేహం

నవతెలంగాణ-సారంగాపూర్



మండలంలోని కౌట్ల(బి) గ్రామానికి చెందిన బెజ్జరం రమేష్(34) ఇటీవల దుబాయ్‌లో ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. ఎంపీపీ మహిపాల్‌రెడ్డి రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా వెంటనే మంత్రి కేటీఆర్‌తో మాట్లాడి మృతదేహాన్ని గల్ఫ్ నుండి హైదరాబాద్‌కు రప్పించారు. శుక్రవారం ఉచిత అంబులెన్స్ ద్వారా స్వగ్రామానికి చేర్చారు. బాధిత కుటుంబ సభ్యులతోపాటు ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, గ్రామస్తులు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. యువకుడు రమేష్ మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కుటుంబానికి అండగా ఉంటామని ఎంపీపీ తెలిపారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఎప్పడిస్తరు..?

- టీజేఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ వినోద్‌కుమార్



నవతెలంగాణ-భైంసా

నియోజకవర్గ వ్యాప్తంగా నిర్మించిన డబుల్ బెడ్ రూమ్‌ల అర్హులను ప్రకటించారు కానీ పంపిణీ ఎప్పుడు చేస్తారని తెలంగాణ జన సమితి విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ వినోద్ కుమార్ అన్నారు. శుక్రవారం భైంసా పట్టణంలోని విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాలూకా వ్యాప్తంగా ఇప్పటికీ డబుల్ బెడ్‌రూమ్‌ల పంపిణీ పూర్తి కాలేదని, కొత్తగా గృహలక్ష్మి పథకం పేరు చెప్పి ప్రజలను మోసం చేయడమే తప్ప చేసిందేమీ లేదని మండి పడ్డారు. పట్టణంలో గతంలో ఇందిరమ్మ స్థలం కేటాయించిన వారి ప్లాట్లను సైతం బీఆర్ఎస్ ప్రభుత్వం లాక్కుని అవే స్థలాలలో నూతన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించి వాళ్లనే పక్కకు నెట్టేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న పథకాలను సక్రమంగా నడిపితే సరి, కొత్త పథకాలు తీసుకొచ్చి ప్రజలను మోసం చేయొద్దని తెలిపారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో సమాధానం చెప్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తులసిరామ్, ఎస్కే మినాజ్, ఎండి అలీంఖాన్, రాజు, శ్రీనివాస్, అశోక్, కృష్ణ, సాబిర్ బాషా పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి 21న చలో కలెక్టరేట్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 21న చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపడుతున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుమ్మిడె భీమేష్ తెలిపారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకారవేతనాలు విడుదల చేయాలని, యునిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ తక్షణమే పంపిణీ చేయాలని, మధ్యాహ్న భోజనం బిల్లులను విడుదల చేయాలని, మధ్యాహ్న భోజనానికి నిధులు పెంచాలనే తదితర డిమాండ్లతో చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ సాయికృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు డి ప్రకాష్ పాల్గొన్నారు.

మనస్తాపంతో వృద్ధుడి ఆత్మహత్య

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ పట్టణం సంజీవయ్యకాలనీకి చెందిన చిలారి నాగయ్య(67) గురువారం రాత్రి తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ బుద్దె స్వామి తెలిపారు. గతేడాది అతని భార్య మృతి చెందగా, అప్పటి నుండి తన కోడలు ఇంట్లో ఉంటున్నాడు. ఒంటరి జీవితం, మానసిక స్థితి బాగాలేకపోవడంతో మనస్తాపం చెంది మద్యం మత్తులో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జాతీయ భావం పెంపొందేలా గాంధీ చిత్ర ప్రదర్శన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జాతీయ భావం పెంపొందేల జిల్లాల్లో మహాత్మాగాంధీ చిత్ర ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జి విద్యాధికారి ఉదయబాబు, జిల్లా పౌర సంబంధాల అధికారి కృష్ణమూర్తి తెలిపారు. భారత స్వతంత్ర వజ్రోత్సవాల ముగింపు కార్యక్రమాలలో ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కెబి థియేటర్‌లో చిత్ర ప్రదర్శనను విద్యార్థులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్ననాటి నుండే జాతీయభావం పొందించడమే లక్ష్యంగా గాంధీ చిత్ర ప్రదర్శన కొనసాగుతోందన్నారు. వజ్రోత్సవ ముగింపు కార్యక్రమంలో భాగంగా ఈ నెల 24 వరకు చిత్ర ప్రదర్శన కొనసాగుతుందని తెలిపారు. గాంధీ చిత్రాన్ని జిల్లాలోని కెబి థియేటర్లో 120 మంది విద్యార్థులు, కాగజ్‌నగర్ పట్టణంలోని వెంకటరమణ థియేటర్లో 795 మంది విద్యార్థులు తిలకించారని తెలిపారు.

కాంగ్రెస్ పాదయాత్ర కొనసాగింపు

కాసిపేట : మండలంలో కాంగ్రెస్ పల్లెపల్లెకు కాంగ్రెస్ పాదయాత్ర కొనసాగుతోంది. 6వ రోజు శుక్రవారం కాసిపేట గ్రామం నుండి పాదయాత్ర ప్రారంభమై సంద్రపాడ్, పెద్దనపల్లి(నాయకపుగూడెం), దుబ్బగూడెం, ట్యాంక్‌బస్తీ, ఎన్టీఆర్ కాలనీ, లంబాడి తండా, సోమగూడెం న్యూకాలనీలో సాగింది. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల కృష్ణ, రాష్ట్ర మహిళా కార్యదర్శి రొడ్డ శారద, నాతరి స్వామి, బెల్లంపల్లి మండల నాయకులు రొడ్డ శ్యాం, కంకటి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ జాడి శంకర్, ప్రభాత్‌రావు, ఎస్సీ సెల్ అధ్యక్షులు గోలేటి స్వామి, మైనారిటీ సెల్ షాకీర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కనుకుల రాకేష్, ఓరియంట్ సిమెంట్ కాంట్రాక్టు అధ్యక్షుడు అన్నం కుమార్, సీనియర్ నాయకులు కనక రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే టికెట్ స్థానికులకే ఇవ్వాలి

ఉట్నూర్ : ఎమ్మెల్యే టికెట్ స్థానికులకే ఇవ్వాలని లంబాడా గిరిజన జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఖానాపూర్ నియోజకవర్గం నుంచి వలస లంబాడి గిరిజనులకు టికెట్ ఇవ్వద్దని డిమాండ్ చేశారు. నియోజకవర్గానికి చెందిన స్థానిక అభ్యర్థికి మాత్రమే టికెట్ కేటాయించాలన్నారు. నియోజకవర్గ ప్రాంత సమస్యలు, ఇక్కడి ఆదివాసీ గిరిజనుల కష్టాలు తెలియని బయటి ప్రాంతం నుంచి వచ్చిన వారికి టికెట్ కేటాయించొద్దన్నారు. ఒకవేళ బీఆర్ఎస్, ఇతర ఏ పార్టీ అయిన స్థానికేతరులకు టికెట్ కేటాయిస్తే చిత్తుచిత్తుగా ఓడిస్తామని హెచ్చరించారు. ఇప్పటికే ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ, లంబాడి గిరిజనుల మధ్య విభేదాలున్న నేపథ్యంలో వలస లంబాడీలకు టికెట్లు ఇవ్వద్దని కోరారు. విలేకరుల సమావేశంలో నాయకులు దేవిదాస్, రామారావు, గంగారాం, రాందాస్ ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ఆసిఫాబాద్: విద్యార్థులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని చైతన్య కళాశాల కరస్పాండెంట్ రాజశేఖర్ అన్నారు. తమ కళాశాలలో చదివి ఏపీపీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమం పూర్తి చేసుకుని ప్రశంసా పత్రాలు పొందిన నేపథ్యంలో వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అప్పుడే కళాశాలకు పేరు ప్రతిష్టలు పెరుగుతాయని తెలిపారు. కళాశాలలో మరింత మంది విద్యార్థులకు వీరు ఆదర్శప్రాయంగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్
2
శనివారం 19 ఆగస్టు 2023

డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్
ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా చీఫ్ మేనేజర్ మధుసూదన్ పాల్గొని మాట్లాడారు. బ్యాంక్ అవశ్యకత, వివిధ రకాల ఖాతాలు వడ్డీ రేట్లను వివరించారు. అలాగే బ్యాంక్ ఖాతాలు లేని విద్యార్థులందరికి కళాశాలలోనే ఖాతాలు తెరవడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా.జలగం అనిత, అధ్యాపకులు కె.చంద్రకాంత్, బ్యాంక్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పోషకాల సమతుల్యతపై అవగాహన

నవతెలంగాణ-ముథోల్
మండలంలోని తరోడ రైతు వేదికలో శుక్రవారం రైతులకు పంట దిగుబడి పెంపొందించడానికి పోషకాల సమతుల్యత వినియోగంపై అవగాహన కల్పించారు. గ్రీన్ గ్రో న్యూట్రియెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి అంజి ప్రసాద్, ఏఓ అజ్మీర బాస్కర్, ఆర్ఎం కరుణాకర్ పాల్గొని, రైతులకు వివరించారు. కాల్షియం థియో సల్ఫేట్ గురించి తెలిపారు. నేల లవణీయత తగ్గిస్తుందని, హానికరమైన లవణాలు బయటకు పంపుతుందని పోషకాలు తీసుకోవడం పెంచుతుందని అన్నారు. ఈ సందర్భంగా పలు సలహాసూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ విలాస్, సుబ్బరామరాజు, గోస్వామి, మధుసూదన్, ధమ్మరాజు, రైతులు పాల్గొన్నారు.



చరిత్రను భావితరాలకు తెలియజేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్
మహనీయుల చరిత్రను భావితరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నదని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ సమావేశ మందిరంలో 373వ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యేతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ముందుగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జయంతి సందర్భంగా జిల్లా ప్రజలందరికి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన సేవలు స్మరించుకుంటూ వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలనీ అన్నారు. జయంతి, వర్ధంతి సందర్భంగా మహనీయుల ఆశయాలను, త్యాగాలను, పోరాటాలను గుర్తుచేసుకోవడం జరుగుతుందని అన్నారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత సమాజ శ్రేయస్సు, వివిధ వర్గాల అభ్యున్నతికి పోరాడిన మహనీయులను గుర్తించి, వారి జయంతి, వర్ధంతిలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. భవిష్యత్ తారలు స్ఫూర్తి పొందేలా వారి సేవలను తెలియజేయాలని అన్నారు. ఐక్యమత్యంతో ఉండి అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు.

పాపన్న గౌడ్ సేవలు మరువలేనివి..

ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ వివిధ ప్రాంతాలలో జరిగిన అన్యాయాలు, అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడిన పాపన్న గౌడ్ సేవలు మరువలేనివని అన్నారు. ఆయన పోరాట స్ఫూర్తితో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు పరుస్తున్నదని వివరించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికి ఆయన జయంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానిక ఆర్టీసీ బస్ స్టాండ్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన ఆయన విగ్రహానికి ఎమ్మెల్యేతో కలిసి విగ్రహావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, అదనపు కలెక్టర్ శ్యామలదేవి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి రాజలింగం, గౌడ, వివిధ కుల సంఘాల నాయకులు, అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

కడెం : దళిత, బహుజనులు ఏకమై పోరాడితేనే రాజ్యాధికారం సాధించవచ్చని నిరూపించిన యోదుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని ఎంపీపీ అలెగ్జాండర్, మండల గౌడ సంఘం నాయకులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 373వ జయంతి కార్యక్రమాన్ని మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ నాయకులు కులస్తులు పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఒక సాధారణ గౌడ గీతా కార్మిక కుటుంబంలో జన్మించి, ఆనాటి సామాజిక వ్యవస్థలోనున్న ఆదిపత్య కులాల అధికారాన్ని, బానిసత్వాన్ని ధిక్కరించి, దళిత బహుజనలను రాజ్యాధికారం వైపు నడిపించిన తొలి బహుజన రాజు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ముందుకు సాగించాలన్నారు. ఈ కార్యక్రమానికి బీఎస్పీ నిర్మల్ జిల్లా ఇన్‌చార్జ్ నాయకులు బన్సీలాల్ రాథోడ్, ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుక్కరికారి రాజేష్ మద్దతు తెలిపి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా గౌడ జర్నలిస్ట్ దశ గౌడ్, రాజేష్‌గౌడ్‌లను సన్మానించారు. అనంతరం కడెం మండల కాంగ్రెస్ అధ్యక్షులు మల్లేష్ యాదవ్, నాయకులు కలిసి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల గౌడ సంఘం నాయకులు కులస్తులు రాముగౌడ్, శేఖర్‌గౌడ్, రాజేశ్వర్‌గౌడ్, తిరుపతిగౌడ్, దశగౌడ్, రవిగౌడ్, రాముగౌడ్, శ్రీనివాస్ మండల గౌడ, కులస్తులు బీఎస్పీ నాయకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అడుగు జాడల్లో నడవాలని బీఎస్పీ. నాయకులు సోయం రాందాస్ అన్నారు. శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులవృత్తితో తృప్తి చెందక బహుజన సమాజానికి సేవ చేయాలనే కాంక్షతో కళ్లు గీస్తే ఏమొస్తది కొడితే గోల్కొండ రాజును కొట్టాలి రాజుపై రాజ్యమేలాలి 12 మంది సైన్యంతో మొఘల్ సైన్యాన్ని ఓడించి ఏడున్నర నెలల పాటు ఆత్మగౌరవంగా గోల్కొండ రాజ్యాన్ని ఏలిన తొలి బహుజన చక్రవర్తి కొదమ సింహం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అలాంటి మాహా నీయునీ అడుగుజాడలో నేటి యువత నడవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇంద్రవెల్లి బీఎస్పీ మండల అధ్యక్షులు పెందుర్ అంకుష్, ఖానాపూర్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు వావల్కర్ శివాజీ, వాగ్మరే శుద్ధోధన్, ఇంద్రవెల్లి మండల ఉపాధ్యక్షుడు లాండ్గే సాయికుమార్, దీపక్ కాంబ్లే, మేస్రం మురారీ, ఉయిక రవి, ఆచార్య గౌతమ్, సోయం మాధవ్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : బహుజన హక్కుల కోసం పోరాడిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని ఎమ్మెల్యే జోగు రామన్న పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ బస్ స్టాండ్ ఎదుట ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని శుక్రవారం ఎమ్మెల్యే లాంచనంగా ఆవిష్కరించారు. ముందుగా విగ్రహ ఏర్పాటు కమిటి సభ్యులు, గౌడ సంఘం నాయకులు ఎమ్మెల్యేకు సాదరంగా స్వాగతం పలికారు. రిబ్బన్ కట్ చేసిన అనంతరం కలెక్టర్ రాహుల్ రాజ్‌తో కలిసి విగ్రహాన్ని అట్టహాసంగా ఆవిష్కరించారు. కార్యక్రమానికి హాజరైన వారు నినాదాలతో హోరెత్తించడంతో ఆ ప్రాంతంగా కోలాహల వాతావరణం నెలకొంది. సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకుని విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బైక్ ర్యాలి నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షులు అజయ్, గౌడ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

తెలంగాణ మొదటి బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని, కులవ్యవస్థను రూపుమాపేందుకు ఎనలేని కృషి చేశారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆమె కార్యాలయంలో శుక్రవారం బీజేపీ నాయకులతో కలిసి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దస్తురాబాద్ : దళిత, బహుజనులు ఏకమై పోరాడితేనే రాజ్యాధికారం సాధించవచ్చని నిరూపించిన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని ఎంపీపీ సింగరి కిషన్ అన్నారు.

శుక్రవారం మండల కేంద్రంలో సర్వాయి పాపన్న 373 జయంతి కార్యక్రమాన్ని మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు శారద, సర్పంచులు నిమ్మ తోట రాజమణి, అంజన్న, గౌడ సంఘం మండల నాయకులు సత్యగౌడ్, రాజగౌడ్, కిషన్, తిరుపతి, రాజు, హన్మగౌడ్, సాగర్ ఉన్నారు.



దస్తురాబాద్‌లో..

ఈవీఎం, వీవీ ప్యాట్‌లపై అవగాహన

నవతెలంగాణ-బోథ్
మండలంలోని ఆయా గ్రామాలు కౌటా(బి), సొనాల, సాకెర, గుర్రాల తండ, పార్డి గ్రామాలలోని ఈవీఎం, వీవీప్యాట్‌లపై డిప్యూటీ తహసీల్దార్ శ్యాంసుందర్ అవగాహన సదస్సు నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈవీఎం, వీవీ ప్యాట్‌ల వినియోగంపై అధికార యంత్రాంగం సంచార ప్రసార రథాల ద్వారా ప్రతి గ్రామానికి వెళ్లి ఓటర్లకు అవగాహన కల్పించారు. గ్రామంలో అధికారులు ఓటర్లకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం), ఓటింగ్‌ను వినియోగిస్తున్న వీవీప్యాట్ వినియోగం, వాటి వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. నమూనాగా కొంతమంది ఓటర్లకు ప్రత్యక్షంగా వీటి పని తీరును చూపించారు. అనంతరం వీటి వాడకంపై ఓటర్లకు ఉన్న సందేహాలను అడిగి తెలుసుకొని నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో అధికారి బోజన్న పాల్గొన్నారు.

21న ప్రజావాణి రద్దు

నవతెలంగాణ-నిర్మల్
ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి, వచ్చే సోమవారం 21న రద్దు చేయడం జరిగిందని డీఆర్వో లోకేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్సైజ్‌శాఖ ద్వారా టెండర్ ప్రక్రియ ఉండటంతో తాత్కలికంగా వాయిదా వేయడం జరిగిందని పేర్కొన్నారు. ఆ తదుపరి సోమవారం నుంచి యధాతధంగా కొనసాగుతుందని తెలిపారు.

ఏఎన్‌ఎంల సమ్మెకు సుహాసినిరెడ్డి మద్దతు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్
రెండో ఏఎస్‌ఎంల న్యాయమైన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట రెండో ఏఎస్‌ఎంల సమ్మె శిబిరాన్ని సందర్శించి, వారికి మద్దతు తెలిపారు. వైద్యాఆరోగ్య శాఖలో పలువురు ఉద్యోగులకు ఏ విధంగా అయితే ఉద్యోగ భద్రత కల్పించారు. రెండో ఏఎస్‌ఎంలకు సైతం ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ఓబీసీ సెల్ అధ్యక్షునిగా సిర్మే సంజీవ్



నవతెలంగాణ-బోథ్
మండల కాంగ్రెస్ ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడుగా మర్లపెల్లి గ్రామానికి చెందిన సిర్మే సంజీవ్‌ను నియమించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా ఓబీసీ సెల్ ప్రెసిడెంట్ అంబకంటి అశోక్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో నాయకులు చిల్కూరి లక్ష్మారెడ్డి, మల్లెపూల సత్యనారాయణ, జిల్లా ఓబీసీ అధ్యక్షులు అశోక్, టీపీసీసీ సభ్యులు డాక్టరు వన్నెల అశోక్, శ్రీకాంత్‌రెడ్డి, మల్లేష్, భోజన్న పాల్గొన్నారు.

మిస్టర్ ఆదిలాబాద్‌ను సన్మానించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్
పక్కా ఆదిలాబాద్ పేరుతో ఇటీవల ఇన్‌స్టాగ్రాంలో నిర్వహించిన మిస్టర్ ఆదిలాబాద్ పోటీల్లో పట్టణానికి చెందిన సాయి విజేతగా నిలిచారు. ఇందులో భాగంగా శుక్రవారం ఆయనను ఎమ్మెల్యే జోగు రామన్న స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఇలాంటి పోటీల వల్ల యువతలో ఉన్న ప్రతిభ బయటకు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గం ట్రస్ట్ చైర్మెన్ దుర్గం శేఖర్, మిషు, ఇమ్రాన్ పాల్గొన్నారు.

జాతీయ మార్కెట్‌లో పత్తి అమ్మకాలు చేపట్టాలి

నవతెలంగాణ-పెంబి
ఆన్‌లైన్ మాధ్యమంలో పత్తి అమ్మకాలు చేపట్టాలని మల్టీ కమోడిటీ ఎక్స్ చేంజ్ సంస్థ ముంబై, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ బద్రుద్దిన్ ఖాన్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పెంబి ట్రైబల్ ఎఫ్‌పీఓ మ్యాక్స్ సంఘ సభ్యులు, ఆసక్తి గల రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తెల్ల బంగారంగా రైతులు పిలిచే పత్తి పంటను కొన్ని పోస్టు హార్వెస్ట్ యాజమాన్య పద్ధతులు పాటించడంతో ఆన్‌లైన్ మాధ్యమంగా జాతీయ అంతర్జాతీయ మార్కెట్‌లలో అత్యధిక ధరకు అమ్ముకోవచ్చని అన్నారు. ఈ సందర్భంగా సంస్థ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ రైతులు కేవలం ముడి పత్తిని అమ్మడం కన్నా జిన్నింగ్ చేసిన పత్తిని బెళ్లుగా చేసి అమ్మడం ద్వారా రైతులకు అధిక ధర లభిస్తుందని తెలిపారు. మండల కేంద్రం నుంచి సంస్థ గోదాముకు బెళ్లను తరలించడానికి అయ్యే రవాణా ఖర్చు, గోదాం రెంటు, ఇన్సూరెన్స్ ఖర్చులలో సగం వరకు సంస్థనే భరిస్తుందని తెలిపారు. బయట మార్కెట్‌లో జరిగే ధరల హెచ్చు తగ్గులతో సంబంధం లేకుండా సంస్థ ముందుగా రైతుకు హామీ ఇచ్చిన మద్దతు ధరను ఇస్తామని అన్నారు. బాహ్య మార్కెట్‌లో పత్తి ధర ఎక్కువ ఉన్న సందర్భాల్లో పెరిగిన ధరను రైతులకు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ ఎఫ్‌పీఓ అధ్యక్షులు టీకాజీ, ఏఈఓలు రాజ్ కుమార్, గంగాజల, రిలయన్స్ డీపీఎం రాజేందర్, సీసీడీ ఫౌండేషన్ ఫీల్డ్ ఆఫీసర్ శివరాజ్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మోకాళ్ల మీద కూర్చొని నిరసన తెలిపిన రెండో ఏఎన్‌ఎంలు



నవతెలంగాణ-నిర్మల్
తమను రెగ్యులర్ చేయడంతో పాటు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ రెండో ఏఎన్‌ఎంలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 12వ రోజుకు చేరుకుంది. జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన దీక్ష శిబిరంలో ఈ మేరకు ఏఎన్‌ఎంలు మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 12 రోజుల నుంచి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సమ్మె చేపడుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమని అన్నారు. ఎలాంటి పరీక్ష నిర్వహించకుండా రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని అన్నారు. ప్రభుత్వ సానుకూలంగా స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జానా, నస్రత్, శోభారాణి, కౌసల్య, జమున, విజయ, రెండో ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మాస్టర్‌ప్లాన్ రద్దు చేస్తాం

- స్కామ్‌ల మంత్రి, సండే నాయకులు ప్రజలను మోసం చేస్తున్నారు
- డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు



నవతెలంగాణ-నిర్మల్
వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేస్తామని డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన మాస్టర్ ప్లాన్‌పై నిర్మల్ మున్సిపాలిటీలో ప్రజలు, రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించిన ప్రభుత్వం రద్దు చేస్తున్నట్టు ప్రకటించిందని గుర్తుచేశారు. కానీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి రైతులపై కుట్రపూరితంగా గత ఏడాది డిసెంబర్ నెలలో 220 జీఓ తీసుకొచ్చారని విమర్శించారు. స్థానిక సోఫీనగర్ ప్రాంతంలో ఇండస్ట్రియల్ జోన్‌లో ఉన్న భూములను మంత్రి తోబుట్టువు కొనుగోలు చేసి ఓ కార్పొరేట్ సంస్థకు విక్రయించారని అన్నారు. అందులో నిర్మాణాలు యదేచ్ఛగా జరుగుతున్న మున్సిపల్ అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. తొమ్మిది నెలల కింద జీఓ అమలైతే ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి కేవలం ఎన్నికల కోసం దీక్షల పేరుతో నాటకం ఆడుతున్నారని విమర్శించారు. నిర్మల్ మున్సిపాలిటీలో 42 పారిశుధ్య కార్మికుల ఉద్యోగాలు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ ఈశ్వర్ అమ్ముకుని, నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడారని అన్నారు. ఇప్పటివరకు వారికి డబ్బులు తిరిగి చెల్లించలేదని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పారదర్శకంగా ఉద్యోగాలను భర్తీ చేస్తామని అన్నారు. దిలావర్‌పూర్ గుండంపల్లి గ్రామాల మధ్య ఇథనాల్ ఫ్యాక్టరీ విషయంలో మంత్రి అల్లోల, ప్రతిపక్ష నాయకుడు మహేశ్వర్ రెడ్డిలు రైతులకు అన్యాయం చేసేలా వ్యవహరిస్తున్నారని అన్నారు ఫ్యాక్టరీ నిర్మాణానికి భూములను బీజేపీ నాయకుల అనుచరులతో కొనుగోలు చేయించారని తెలిపారు. పర్యావరణ శాఖ మంత్రిగా ఉన్న ఇంద్రకరణ్ రెడ్డికి ఇథనాల్ ఫ్యాక్టరీకి అనుమతులు ఎలా వచ్చాయో తెలియదని చెప్పడం సిగ్గుచేటని విమర్శించారు. ఫాక్టరీతో బంగారు పంట పొలాలు కలుషితం అయ్యే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఫ్యాక్టరీ నిర్మాణం రద్దు చేయాలని రెండు గ్రామాల సర్పంచులు ఎందుకు గ్రామపంచాయతీ తీర్మానం చేయడం లేదని ప్రశ్నించారు. అధికార పార్టీ మంత్రి, ప్రతిపక్ష నాయకుడు ఇద్దరు కలిసి నిర్మల్ ప్రాంతాన్ని లూటీ చేస్తున్నారని అన్నారు. రాబోవు రోజుల్లో ప్రజలు ఇద్దరికీ గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పీసీసీ సభ్యులు సాదా సుదర్శన్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ వాజిద్ అహ్మద్ ఖాన్, మాజీ కౌన్సిలర్ పొడెల్లి గణేష్, నాయకులు ఎంబడి రాకేష్, చిన్ను, రమణరెడ్డి, ఖీసర్, మహమ్మద్ బీన్ చౌస్ పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయిలో 5కే రన్‌ను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-బోథ్
మండల కేంద్రంలో నిర్వహించే 5కే రన్‌ను విజయవంతం చేయాలని తహసీల్దార్ సుభాష్ చంద్ర అన్నారు. అలాగే జిల్లా ఎన్నికల అదికారి జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ఐ ఓట్ ఫర్ ష్యూర్ అనే అంశంపై నేడు 19న ఉదయం 6:30గంటలకు తహసీల్దార్ కార్యాలయం నుంచి సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాల బాలికల పాఠశాల వరకు నిర్వహించబడుతుందని అన్నారు. కార్యక్రమానికి ప్రజా ప్రతినిదులు, అదికారులు, యువతీ, యువకులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయలని కోరారు.

నార్నూర్ : కొత్త ఓటరు నమోదుపై శనివారం మండల కేంద్రంలో ఉదయం 5కే రన్‌ను నిర్వహిస్తున్నట్టు శుక్రవారం ఎంపీడీఓ రమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గాంధీ చౌక్ నుంచి భీంపూర్ వరకు ర్యాలీ నిర్వహిస్తునట్టు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఎంపీడీఓ సమావేశ మందిరంలో తహసీల్దార్ రెవెన్యూ సిబ్బంది అధ్వర్యంలో ఓటరు నమోదుపై సమావేశం ఉంటుందని, గ్రామసర్పంచులు ఎంపీటీసీలు హాజరు కావాలని సూచించారు.

ఆలయానికి నిధులు మంజూరు చేయాలి

నవతెలంగాణ-బోథ్
మండల కేంద్రంలోని మార్కండేయ ఆలయ పునర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని శుక్రవారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కమిషనర్ కార్యాలయంలో దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే రాష్ట్ర దేవాదాయ శాఖ అధికారి కొమురయ్య వారి కార్యాలయంలో కలిసి సీజీఎఫ్ నిధులు విడుదల చేయాలని కోరారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించి, వెంటనే నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్యవర్గ సభ్యులు వడ్లకొండ సురేందర్, పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షులు మెరుగు బోజన్న, మండల ప్రధాన కార్యదర్శి సిరిపురం చంద్రమోహన్, న్యాయ సలహాదారు అడేపు హరీష్, న్యాయవాది పంద్రం శంకర్, యూత్ సభ్యుడు బోగా సాయి కుమార్ పాల్గొన్నారు.

సాదా సీదాగా మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి
ప్రతి మూడు నెలలకొకసారి జరుగే మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం సాదా సీదాగా కొనసాగింది. ఎంపీపీ పోటే శోభ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అధికారులు గైర్హాజరయ్యారు. మొత్తం 16 అశంలపై చర్చ జరుగాల్సి ఉండగా కేవలం విద్యా, వైద్య వ్యవసాయ, ఐసీడీఎస్, ఐటీడీఏ ఇంజనీరింగ్, ఐకేపీ శాఖలపై సభ్యులు అడిగిన సమస్యలపైన ప్రస్తావించారు. మిగత పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, ఆశ్రమ పాఠశాల శాఖల అధికారులు హాజరు కాక పోవడంతో సమస్యలు ఎవరికి తెలియజేయాలని గౌరవ సర్పంచులు, ఎంపీటీసీలు మండి పడ్డారు. ప్రతి సర్వసభ్య సమావేశంలో కొందరు శాఖ అధికారులు హాజరు కాక పోవడంతో సమస్యలు ఎలా తీరుతాయని అన్నారు. ఈ సారి ఎంపీడీఓ సమావేశమందిరానికి బదులు రైతు వేదికలో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయడంతో చాలా మంది అధికారులకు, గౌరవ సభ్యులకు స్పష్టమైన సమాచారం లేక పోవడంతో నానా అవస్థలు పడ్డారు. ఐటీడీఏ ఇంజనీర్ అధికారి తన నివేదికను చదువుతూ మేండాపల్లి వద్ద నున్న ఐటీడీఏ గురుకుల విద్యాలయానికి అదనపు తరగతుల గదుల కోసం రూ.2.70 కోట్లతో పనులు జరుగుతుండగా, సిబ్బందికి క్వార్టర్స్ మౌలిక వసతుల కోసం మరో రూ.5.0 కోట్లు మంజూరయ్యాయని అది టెండర్ దశలో ఉందన్నారు. వ్యవసాయ శాఖ తమ నివేదికను వివరిస్తుండగా హార్కాపూర్ సర్పంచ్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల దెబ్బ తిన్న పంటల వివరాలు తెలియజేయాలని అన్నారు. నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. దీంతో ఆ శాఖ అధికారులు నష్టపరిహారంపై ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని సమాధానమిచ్చారు. ప్రజల సమస్యలను పక్కన పెట్టి నామ మాత్రంగా కొనసాగిస్తున్నట్లు గౌరవ సభ్యులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. అనంతరం ఎంపీడీఓ పుష్ప లతకు ఇటీవల 15 ఆగస్టు నాడు ఉత్తమ అధికారిగా అవార్డు రావడంతో ఆమెకు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సర్వ సభ్య సమావేశంలో జెడ్పీటీసీ అర్క పుష్ప లత వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్ రూరల్ : ఆదిలాబాద్ మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ గంద్రత్ రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా అగ్రికల్చర్, విద్య, వైద్యం, ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. కొన్ని శాఖల అధికారులు సమావేశానికి గైర్హాజరయ్యారు. ఈ సమావేశంలో అధికారులు ప్రగతి నివేధికను చదివివినిపించారు. సభ్యులు లేవనేత్తిన సమస్యలకు అధికారులు సమాధానమిచ్చారు. దీంతో సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మికాంత్, తహసీల్దార్ గణేష్, ఎంపీఓ ఆనంద్, కోఆప్షన్ సభ్యులు షేక్ ఆరిఫ్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ముధోల్‌కు డీగ్రీ కళాశాల మంజూరుపై హర్షం

నవతెలంగాణ-ముధోల్
మండలంలో ప్రభుత్వ డీగ్రీ కళాశాల మంజూరు చేయటంపై మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు కృషి చేసిన ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అఫ్రోజ్‌ఖాన్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ముధోల్‌లో డీగ్రీ కళాశాల మంజూరుకు ఎమ్మెల్యే కృషిపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మెన్ సురేందర్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఖాలిద్, విట్టోలి తండ సర్పంచ్ విజేష్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, కిష్టయ్య, బాబన్న, పోతన్న యాదవ్, బషీర్, స్థానికులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో ఎద్దు మృతి



నవతెలంగాణ-కోటపల్లి

మండలంలోని పుల్లగామా గ్రామానికి చెందిన కావిరి చిన్న సమ్మయ్య ఎద్దు శుక్రవారం ఉదయం విద్యుత్ తీగ తగిలి చనిపోయింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. సమ్మయ్య పొలం పనులకు చేనుకు వెళ్లగా పాత పుల్లగామా గూడెం వద్ద విద్యుత్ తీగ తగిలి చనిపోయింది. ఎద్దు తనముందు ఉండటం వల్ల తనకు ప్రమాదం తప్పిందని వాపోయాడు. తీగా తెగిన విషయం విద్యుత్ అధికారులకు ముందే తెలిపిన స్పందించలేదని కాలనీ వాసులు పేర్కొన్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్షం వల్లే రూ.50 వేలు విలువ చేసే ఎద్దు మరణించిందని బాధితుడు అవేదన చెందుతున్నాడు. అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరుకుంతున్నాడు.

బీసీ బాంధవుడు సీఎం కేసీఆర్

నవతెలంగాణ-కోటపల్లి

ముఖ్యమంత్రి కేసీఆర్ బీసీ బాంధవుడని, రాష్ట్రంలోని సబ్బండ వర్గాలకు సమన్యాయం చేసేందుకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని బీఆర్ఎస్ యువజన మండల అధ్యక్షుడు మారిశెట్టి విద్యాసాగర్ అన్నారు. శుక్రవారం ఆలుగామా గ్రామానికి చెందిన పోతురాజుల సురేష్‌కి మంజూరైన బీసీ కులవృత్తిదారులకు రూ.లక్ష చెక్కును ఆలుగామా తపాలా శాఖ ఉద్యోగి గోమస ప్రవీణ్ చేతుల మీదుగా లబ్ధి దారుడికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో రుణం కావాలంటే బ్యాంకులు, అధికారుల చుట్టూ చెప్పులరిగేలా తిరిగేవాళ్లమని, ఇప్పుడు సీఎం కేసీఆర్ నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే నగదు జమ చేస్తున్నారని పేర్కొన్నారు. సర్కారు సాయాన్ని సద్వినియోగం చేసుకుని కులవృత్తిదారులు ఆర్థికంగా నిలదొక్కుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ కోఆప్షన్ సభ్యుడు హజ్జర్, వైస్ ఎంపీపీ వాల శ్రీనివాస్, ఎంపీడీఓ భాస్కర్, ఆలుగామా తపాలా శాఖ ఉద్యోగి ప్రవీణ్ పాల్గొన్నారు.

పోరాట వీరుడు పాపన్న గౌడ్

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్
- ఘనంగా సర్వాయి పాపన్న జయంతి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ కొనియాడారు. కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ల అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి, అభివృద్ధికి జమీందారులు, జాగీర్దార్లకు వ్యతిరేకంగా వీరోచిత పోరాటం చేసి ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిన గొప్ప వ్యక్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అన్నారు. ఆయన జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని, యువత పాపన్నగౌడ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సన్మార్గంలో జీవించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణు, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు జగ్గగౌడ్, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, బీసీ సంక్షేమ శాఖ అధికారి సత్యనారాయణరెడ్డి, గౌడ సంఘం నాయకులు బాలేష్‌గౌడ్, సుదర్శన్‌గౌడ్, మనోహర్‌గౌడ్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేష్, బీసీ సంఘం రైతు అధ్యక్షుడు మారుతి పటేల్, యువజన సంఘం నాయకుడు ప్రణయ్, ఆరే సంఘం నాయకుడు నాగోసే శంకర్ పాల్గొన్నారు.

జన్నారం : బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 373 జయంతిని, మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. బహుజనల రాజ్యాధికారం పాపన్న గౌడ్ చేసిన పోరాటం మరిచిపోలేనిదని ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని జయంతి కార్యక్రమంలో పలువురు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాదాడి సరోజన, జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ సుతారి వినయ్, మండల కోఆప్షన్ సభ్యులు మున్వర్ అలీ ఖాన్, టీడీపీ రాష్ట్ర నాయకులు తాళ్లపల్లి రాజేశ్వర్, రైతు సంఘం డైరెక్టర్ సిటిమల భరత్ కుమార్, సర్పంచల సంఘం మండల కన్వీనర్ జాడి గంగాధర్, మండల గౌడ సంఘం అధ్యక్షులు మూల బాస్కర్, మోకు దెబ్బ రాష్ట్ర నాయకులు బాలసాని శ్రీనివాస్, గౌడ సంఘం రాష్ట్ర నాయకుల కాసారపు పోచగౌడ్, జన్నారం ఎంపీటీసీ రియాజొద్దిన్, పట్టణ అధ్యక్షుడు పోడేటి సత్యగౌడ్ పాల్గొన్నారు.

కాసిపేట : మండలంలోని కొండాపూర్ చౌరస్తాలో శుక్రవారం మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 373 వ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సర్వాయి పాపన్న చిత్రపటానికి మండల గౌడ సంఘం అధ్యక్షుడు మార్క శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పోడేటి రాజా గౌడ్, ఉపాధ్యక్షులు భాస్కర్ గౌడ్, పదాల మల్లేష్ గౌడ్, ముఖ్య సలహాదారు తాటిపాముల శంకర్ గౌడ్, నేరెళ్ల బుగ్గయ్య గౌడ్ పల్లె మల్లయ్య గౌడ్, కోడూరి గురువయ్య గౌడ్ బుర్ర లింగ గౌడ్ లు పూలమాలలు వేశారు.

మందమర్రి : మందమర్రి గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి నిర్వహించారు. రేణుక ఎల్లమ్మ దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన జయంతిలో గౌడ సంఘం జిల్లా నాయకులు మడిపల్లి వెంకటేశ్వర్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు పెద్దపల్లి సత్యనారాయణ, జిల్లా నాయకులు నోముల ఉపేందర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు జనగామ జిల్లాను సర్వాయి సర్దార్ పాపన్న గౌడ్ జిల్లాగా ప్రకటించాలని, ప్రతి జిల్లా కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బై రాజు శ్రీనివాస్, రాజా గౌడ్, వెంకా గౌడ్, రాజయ్య, రవీందర్, ఆంజనేయులు, నర్సయ్య, కన్నయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

తాండూర్ : గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ల అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ భూసారపు మొండిగాడు తాండూర్ జడ్పీటీసీ బానయ్య, ఎంపీపీ ప్రనయ్ కుమార్, రాష్ట్ర నాయకులు తాళ్లపల్లి శంకర్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పేరుమండ్ల భాస్కర్ గౌడ్, ఉప సర్పంచ్ రాజశేఖర్‌గౌడ్, పాల్గొన్నారు.

భీమారం : తెలంగాణ ఆత్మగౌరవ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జన్మదిన వేడుకలను శుక్రవారం భీమారం గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పోలంపల్లి గ్రామంలోని తాళ్ళ గూడెం రేణుకా ఎల్లమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వున్నం, శ్రీకాంత్, మొండయ్య, సమ్మా శ్రీనివాస్, రాజా, శ్రావణ్, ప్రణీత్ పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : మండలకేంద్రంలోని ప్రెస్‌క్లబ్ ఆవరణలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా శుక్రవారం మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ల అర్పించారు. కార్యక్రమంలో మండల గౌడ సంఘం సభ్యులు రాజాగౌడ్, మండల కోఆప్షన్ సభ్యుడు సాజిద్, సురేష్, వెంకటేశ్, సుధాకర్, భుజంగరావు, సాయికృష్ణ, నరసింహులు పాల్గొన్నారు.

కౌటాల : ఘనంగా సర్వాయి పాపన్నగౌడ్ 373వ జయంతి వేడుకలను మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, సర్పంచ్ వొజ్జెల మౌనీష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.



భీమారంలో..



కౌటాలలో..



జన్నారంలో..



కాసిపేటలో..

జనక్ ప్రసాద్‌కే టికెట్ కేటాయించాలి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి కార్మిక క్షేత్రంలోని రామగుండం అసెంబ్లీ స్థానాన్ని ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి, వేజ్ బోర్డ్ శాశ్వత సభ్యుడు జనక్ ప్రసాద్‌కు కేటాయించాలని పీసీసీ అధిష్టానానికి పత్రిక ముఖంగా కోరుతున్నట్లు ఐఎన్టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జడ్పీ శంకర్‌రావు అన్నారు. శుక్రవారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలోని మొత్తం అసెంబ్లీ స్థానాలలో 12 అసెంబ్లీ స్థానాలు సింగరేణి కార్మిక క్షేత్రంలో ఉన్నాయని, కాని ఇప్పటివరకు కార్మిక సమస్యలపై అసెంబ్లీలో గళం విప్పిన నాయకులే లేరని, కార్మికుల సంక్షేమం కోసం పోరాడే నాయకుడు అసెంబ్లీలో అడుగుపెడితే కార్మికుల హక్కులకై పోరాడుతాడని తెలిపారు. బొగ్గు కార్మికుల సంక్షేమానికి జనక్‌ప్రసాద్ నిబద్ధత తో ఉన్నారన్నారు. ఐఎన్టీయూసీ భారతదేశంలోనే అతిపెద్ద కార్మిక సంస్థ అని, ఈ సంవత్సరంలో నాయకుడిగా జనక్ ప్రసాద్ యూనియన్ 3.36 కోట్ల సభ్యత్వం మద్దతు ఉన్నట్లు పేర్కొన్నారు. ఐఎన్‌టీయూసీకి మార్గదర్శకత్వం వహిస్తున్న జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి ఆయనకు మద్దతుగా ఉన్నట్లు పేర్కొన్నారు. 12 అసెంబ్లీ నాలుగు లోక్సభ నియోజకవర్గాలను కలిగి ఉన్న కోల్‌బెల్టు ప్రాంతంలో జనక్ ప్రసాద్ ప్రభావం ఉంటుందని, అందువలన ఐఎన్టీయూసీ కోటాలో ఆయన అభ్యర్థిత్వం వల్ల కాంగ్రెస్ పార్టీకి 9 నుండి 10 అసెంబ్లీ స్థానాలను గెలుచుకోవడానికి దోహదం చేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు, నరేందర్, స్వామి, రాజయ్య, శ్యామ్, భీంరావ్ పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకు భారతరత్న ఇవ్వాలి

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

భారత దేశము తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రబాయి పూలేకు భారతరత్న ఇవ్వాలని తెలంగాణ బీసీ జాగృతి జిల్లా అధ్యక్షుడు నెరెడ్ల శ్రీనివాస్ అన్నారు. జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవ సందర్భంగా శుక్రవారం మంచిర్యాల హైటెక్ సిటీలోని తెలంగాణ బీసీ జాగతి సంఘం కార్యాలయంలో ఆరుగురు ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే జయంతిని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. సావిత్రిబాయి చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలని, భారతరత్న అవార్డును ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేష్ గౌడ్, గుండేటి యోగేశ్వర్, అత్తి సరోజ, తుల మధుసూదన్, తెలంగాణ బీసీ జాగతి పట్టణ అధ్యక్షుడు మడుపు రామ్ ప్రకాష్, ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి లక్ష్మణ్, యువజన అధ్యక్షుడు మాచర్ల సదానందం, కోశాధికారి సల్ల విజయ్ కుమార్, ఉపాధ్యక్షుడు బోయిన హరికృష్ణ, బిట్రగుంట రాంబాబు, గందతిరుపతి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలని ఇన్‌ఛార్జి జిల్లా విద్యాధికారి ఉదయ బాబు తెలిపారు. జిల్లా కేంద్రాల్లోని బాలికల ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్‌లకు రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో రీడింగ్ కాంపెయిన్ పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. గ్రంథాలయ పుస్తకాల వినియోగంపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. పుస్తకాలు తీసుకున్న విద్యార్థులు వాటిని సరిగ్గా వినియోగిస్తున్నారా లేదా అనే విషయాలు పరిశీలించాలన్నారు. అనంతరం రూమ్ టు రీడ్ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్, సెక్టోరల్ అధికారి సుభాష్, రూమ్ టు రీడ్ జిల్లా ఇన్‌ఛార్జి జెనిఫర్, రిసోర్స్ పర్సన్ శంకర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంలో అవినీతి పాలన

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

రాష్ట్రంలో తొమ్మిది సంవత్సరాల బీఆర్ఎస్ అవినీతి పాలన కొనసాగిస్తుందని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చపిడె సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు జునుగరి మధూకర్ ఆధ్వర్యంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అబద్దాలతో ప్రజలను మోసం చేస్తున్నారని, కేంద్రం నిధులతోనే జాతీయ రహదారులు అభివృద్ధి చెందాయన్నారు. రాష్ట్రంలో రోడ్లకు మరమ్మత్తులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, నిరుద్యోగులను పట్టించుకోవడంలేదని, కొత్త రేషన్‌కార్డులు ఇప్పటివరకు ఇవ్వలేదని అన్నారు. ధరణి పేరుతో రైతులను గోసపెడుతున్నారని, రాష్ట్రంలో 52 శాతం ఉన్న బీసీలకు మోసపూరితమైన హామీలతో అన్యాయం చేస్తున్నారన్నారు. బీజేపీతోనే రాష్ట్రం అభివృద్ధి పతంలోకి దూసుకెళ్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్‌సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ లహన్‌రాజ్, ఎస్‌టీ మోర్చా మండల అధ్యక్షుడు భీమయ్య, బీసీ మోర్చా మండల అధ్యక్షుడు శ్రీకాంత్, బీజేపీ నాయకులు అనంతరావు, రాజేశ్వర్, నానాజీ, హరీష్, శోభన్, మహేష్, శంకర్‌గౌడ్, కాంతారావు పాల్గొన్నారు.

విలేకరి కుటుంబాకి పరామర్శ

నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి సిటీ కేబుల్ సీనియర్ రిపోర్టర్ సెగ్గం రాధాకృష్ణ ఇటీవల అనారోగ్యంతో చనిపోగా శుక్రవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నేతకాని మహర్ హక్కుల పరిరక్షణ సంఘం జాతీయ అధ్యక్షుడు గోమాస శ్రీనివాస్ వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నేతకాని మహర్ హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యేస్సూరి రాజమల్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సుదర్శన్, ఎల్లయ్య, రాష్ట్ర యూత్ అధ్యక్షుడు ప్రదీప్, జిల్లా అధ్యక్షుడు నాగరాజు, మహిళా అధ్యక్షురాలు అనూష, కోశాధికారి లింగన్న, వాసుదేవ్, లక్ష్మి, బీమారం మండల అధ్యక్షుడు కోట రాజాం, కాసిపేట్ మండల అధ్యక్షుడు మహేందర్ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన మల్లికార్జున్

ఆసిఫాబాద్ : నియోజకవర్గానికి చెందిన నాయకుడు రాచబత్తుల మల్లికార్జున్ హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పర్లపల్లి రవీందర్, ఉపాధ్యక్షుడు పోల్కర్ సాయిరాం, రాష్ట్ర కార్యదర్శి మహేష్, సహాయ కార్యదర్శి చౌహాన్ పృథ్వీరాజ్, జాతీయ క్రమశిక్షణ కమిటీ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, మునుగోడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి జక్కలి ఐలయ్య, తెలుగు మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు షకీలారెడ్డి పాల్గొన్నారు.

ఒంటి కాలుపై రెండవ ఏఎన్ఎంల నిరసన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రెండవ ఏఎన్ఎంలను ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరవధిక సమ్మెలో భాగంగా శుక్రవారం మూడో రోజు ఒంటి కాలుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ రాష్ట్రంలో రెండవ ఏఎన్ఎం తోపాటు, ఈసీ, అర్బన్ ఆర్బిఎస్కే, 104 సిబ్బందిని భేషరతుగా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. గత 20 సంవత్సరాల నుంచి చాలీచాలని వేతనాలు తీసుకుంటూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎలాంటి పథకాలైన అమలులో ముందుంటున్నారని అన్నారు. ప్రజల ఆరోగ్యం కాపాడడం కోసం 30 రకాల సేవలు అందిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏఎన్ఎం, ఈసి, ఆర్బీఎస్కే, 104 సిబ్బంది శ్రమను గుర్తించి వెంటనే రెగ్యులర్ చేయాలని లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చేవరకు నిరవధిక సమ్మె కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్, రెండవ ఏఎన్ఎం సంఘం రాష్ట్ర నాయకులు వసంత, జిల్లా అధ్యక్షురాలు సంతోషి, జిల్లా ప్రధాన కార్యదర్శి పుణ్యవతి, ఉపాధ్యక్షులు ప్రచార కార్యదర్శి భూదేవి, ప్రమీల, లక్ష్మీ, సరస్వతి, తిరుమల, లీల, రాధ పాల్గొన్నారు.

ఏఎన్ఎంలకు జడ్పీటీసీ సంఘీభావం

రెండవ ఏఎన్ఎంలు సమస్యలు పరిష్కరించాలని చేస్తున్న నిరసనకు జడ్పీటీసీ నాగేశ్వరరావు బీసీ సంఘం నాయకులతో కలిసి వెళ్లి సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం దృష్టికి సమస్య తీసుకు వెళ్తానని పరిష్కారం కోసం కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేష్, యువజన సంఘం అధ్యక్షుడు ప్రణయ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మారుతి పటేల్, ఆరె సంక్షేమ సంఘం నాయకుడు నాగోసి శంకర్ పాల్గొన్నారు.

నేటి 5కే రన్‌ను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 19న ఉదయం 6 గంటలకు జిల్లాలో 'ఏ ఓట్ ఫర్ షఉర్' అనే నినాదంతో నిర్వహించనున్న 5కె రన్‌ను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బొర్కాడే హేమంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని 2 నియోజకవర్గాల పరిధిలో నిర్వహించనున్న 5కె రన్ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, యువత, విద్యార్థినీ, విద్యార్థులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

ఎంచికల్‌పేట్ : మండలకేంద్రంలో నేడు ఉదయం ఆరు గంటలకు నిర్వహించే 5కే రన్‌ను ప్రజా ప్రతినిధులు, అధికారులు, సర్పంచ్‌లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొని విజయవంతమయ్యేలా చూడాలని తహసీల్దార్ సరిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారత ఎన్నికల సంఘం, జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలకేంద్రంలో నేను ఖచ్చితంగా ఓటు వేస్తాను అనే నినాదంపై 5కే రన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు, మండలంలోని యువకులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వాంకిడి : మండలకేంద్రంలోని స్థానిక హిందూస్థాన్ పెంట్రోల్‌పంప్ ఇందిరానగర్ నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు ఉదయం ఆరు గంటలకు నిర్వహించనున్న 5కే రన్‌ను విజయవంతం చేయాలని తహసీల్దార్ రెహిమొద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో పాల్గొని 5కే రన్‌ను విజయవంతం చేయాలని కోరారు.

పనులను త్వరితగతిన చేపట్టాలి

నవతెలంగాణ-తాండూర్

మన ఊరు-మన బడి పథకంలో భాగంగా జరుగుతున్న నిర్మాణపు పనులను త్వరితగతిన చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంఈఓ వాసాల ప్రభాకర్ కోరారు. శుక్రవారం మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో జరుగుతున్న డైనింగ్ హాల్ నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో మన ఊరు-మన బడి ద్వారా మంజూరైన పనులను త్వరతగతిన చేపట్టాలన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు ఉండే విధంగా పర్యవేక్షించాలని హెచ్ఎం ప్రేమలతకు తెలిపారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పర్యవేక్షించారు. మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం పప్పులు కూరగాయలు వాడాలని చెప్పారు.

పీఆర్సీ కమిషన్ నియమించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

ప్రభుత్వం సత్వరమే పీఆర్సీ కమిషన్ నియమించాలని పీఆర్టీయూటీఎస్ మండల అధ్యక్ష్యుడు ఎనగంటి బిక్షపతి డిమాండ్ చేశారు. కాగజ్‌నగర్ జడ్పీఎస్-ఎస్ గర్ల్స్, బాయ్స్, చింతగూడ, పెట్రోల్ పంపు ఏరియా ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 32 శాతం ఐఆర్ ప్రకటించాలని, సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. 1 నుండి 19 పైన విద్యార్థులున్న ప్రతీ ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులను తప్పనిసరిగా నియమించాలని, అడ్జస్ట్ మెంట్ విధానం కాకుండా విద్యావాలంటిరీలను నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు ఎనగంటి బిక్షపతి, పత్తి పాక శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణను అరికట్టాలి

నవతెలంగాణ-నస్పూర్

నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని 76వ సర్వే నంబర్ గల ప్రభుత్వంలో కొంతమంది యదేచ్ఛగా స్థలాన్ని ఆక్రమించారని బీఎస్పీ మహిళా జోనల్ కన్వీనర్ మద్దెల భవాని ఆరోపించారు. శుక్రవారం గురైన స్థలాన్ని పరిశీలించి మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డులో ఖాళీ స్థలం కనిపిస్తే కొంతమంది కబ్జాలకు పాల్పడి కట్టడాలు నిర్మిస్తున్నారని అన్నారు. నస్పూర్ మండలంలో గతంలో పనిచేసిన తహసీల్దార్, ప్రస్తుత కమిషనర్ అసమర్థత వల్లే భూములు కబ్జాలకు గురవుతున్నాయని పేర్కొన్నారు. దీనికి తోడు కబ్జాదారులకు అధికార పార్టీ నాయకుల అండదండలు ఉన్నాయన్నారు. దీనిపై అధికారులు వెంటనే స్పందించకపోతే బహుజన సమాజ్ వాది పార్టీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శిరీష పాల్గొన్నారు.

అతి వేగం రోడ్డు ప్రమాదాలకు కారణం

- బెల్లంపల్లి ఏసీపీ సదయ్య



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా అతి వేగంగా వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని బెల్లంపల్లి ఏసీపీ సదయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక ఆర్‌కోసీ ఓఏ క్లబ్‌లో పట్టణ ఎస్సై బి.అశోక్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు రోడ్ సేఫ్టీ, ట్రాఫిక్ రూల్స్, అభయ యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి బెల్లంపల్లి ఏసీపీ సదయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆటో డ్రైవర్లు బాధ్యతాయుతంగా వాహనాలు నడుపుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు. ఖాకీ చొక్కా విధిగా ధరించడంతో పాటు లైసెన్స్ కలిగి ఉండాలని, వాహనానికి ఇన్సూరెన్స్ ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన పెంపొందించుకోవాలని ముఖ్యంగా పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని ప్రమాదాలకు కారణం కావద్దని డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఆటో డ్రైవర్లు ప్రయాణికులతో సత్ప్రవర్తనతో మెలగాలని, ప్రమాదాల నివారణకు సహకరిస్తూ ప్రమాదరహిత ప్రాంతంగా తీర్చిదిద్దాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనల పట్ల రోడ్ల మీద ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలపవద్దని సూచించారు. ప్రయాణికులను ఆటోలో ఎక్కించుకునే సమయంలో దింపే సమయంలో రోడ్డు పక్కన ఆపాలని, వాహనం నడిపే సమయంలో డ్రైవింగ్‌పై శ్రద్ధ వహించాలని, భారీ శబ్దాలతో కూడిన మైక్ సెట్లను అమర్చి ప్రయాణికులకు అసౌకర్యం కలిగించకూడదని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పట్టణ ఆటో డ్రైవర్స్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-నస్పూర్



సింగరేణి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం (ఐఎఫ్టియూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు విశ్వనాద్ అన్నారు. శుక్రవారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి సమస్యలు కార్మికులు అనేక రకాలైన సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సింగరేణిలో 11వ వేతన ఒప్పందానికి సంబంధించిన ఏరియార్స్ ఆగస్టు నెల జీతాలతో ఓకే దఫా చెల్లించాలని, 22 ఆర్థిక సంవత్సరానికి సింగరేణికి వచ్చిన రూ.700 కోట్ల లాభాలను కార్మికులకు, కాంట్రాక్ట్ కార్మికులకు కూడా పంచాలని పేర్కొన్నారు. 190/240 మాస్టర్ నిండిన ప్రతి ఒక్క బదిలీ పిల్లర్ కార్మికున్ని పర్మనెంట్ చేయాలని, సింగరేణి వ్యాప్తంగా సర్ఫేస్‌లో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేయాలన్నారు. అలాగే మీద కేటగిరిల్లో పని చేసే కార్మికులకు పదోన్నతులు కల్పించాలని, సేఫ్టీ మైన్స్ కమిటీ, సింగరేణి సంస్థ నిర్వహించే అధికారిక కార్యక్రమాల్లో గోదావరి లోయ బొగ్గు గని సంఘానికి ప్రాధాన్యత కల్పించాలని, మైనింగ్ స్టాఫ్ టెక్నీషియన్స్, ఈపీ ఆపరేటర్ మెడికల్ అన్ఫిట్ అయితే సర్ఫేస్‌లో సూటబుల్ జాబ్ ఇవ్వాలన్నారు. కారుణ్య నియామకల్లో వయోపరిమితి 40 సంవత్సరాలకు పెంచాలని, ఈపీ ఆపరేటర్ల ప్రమోషన్లలో ఇలాంటి సమస్యలు లేకుండా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేకల రామన్న, నాయకులు రామకృష్ణ, ప్రసాద్, సురేందర్, సంపత్, సారయ్య, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శనివారం 19 ఆగస్టు 2023

భగీరథ నీళ్లు రావడం లేదని నిరసన


నవతెలంగాణ-నార్నూర్

భగీరథ నీరు రావడం లేదని శుక్రవారం మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో మహిళలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోవడంతో నీటి సరఫరా చేయడం లేదని మహిళలు తెలిపారు. ప్రభుత్వం వెంటనే వారి సమస్యలను పరిష్కరించి నీళ్ల సరఫరా చేసే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



బీసీ బంధు చెక్కుల పంపిణీ

కాగజ్‌నగర్ : రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన బీసీ బంధు చెక్కులను శుక్రవారం కాగజ్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్దిదారులకు పంపిణీ చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా 300 మందికి ఈ చెక్కులను ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో సీఎం కేసీఆర్ ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాడని అన్నారు. పేదలకు అండగా నిలిచే ఈ ప్రభుత్వాన్నే ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సద్దాం హుస్సేన్, జెడ్పీ వైస్ ఛైర్మన్ కోనేరు కృష్ణారావుతో పాటు ఆయా మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



నవతెలంగాణ-మందమర్రి

మందమర్రిలో రెండు లారీలు ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో సోమవారం ఇద్దరు మృతి చెందారు. పట్టణంలోని అందుగుల పేట పెట్రోల్ బంక్ ఫంక్షన్‌హాల్ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం ఆగివున్న కంటైనర్ లారీని చత్తీస్గఢ్ నుంచి బెంగళూరు వెళ్తున్న మరో లారీ వెనుక నించి వచ్చి ఢీ కొంది. అందులో ఉన్న క్లీనర్ సురేష్, డ్రైవర్ హనుమంతులకి తీవ్ర గాయాలు అవ్వడంతో మంచిర్యాల ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో దారిమధ్యలో సురేష్, ఆస్పత్రిలో హనుమంతులు మృతి చెందారు. ఇద్దరూ అనంతపురం జిల్లా లేపాక్షి మండలానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. సీఐ మహేందర్ రెడ్డి, ఎస్సై చంద్రకుమార్ కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

మానవహారంగా ఏర్పడి నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను యధావిధిగా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ, తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్, సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సమ్మె కొనసాగుతోంది. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె శుక్రవారంతో 4వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా సమ్మె శిబిరం నుంచి కుమురంభీం చౌక్ వరకు ర్యాలీగా తరలివెళ్లి మానవహారం చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంపీహెచ్ఏ(ఎఫ్) పోస్టుల భర్తీ కోసం విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని అన్నారు. 1520 పోస్టుల భర్తీకి పరీక్ష నిర్వహించి, సెలక్ట్ చేయబోతోందన్నారు. దీంతో కాంట్రాక్టు ఉద్యోగులు కూడా పరీక్ష రాయాల్సి వస్తోందని, మెరిట్ వస్తేనే సెలక్ట్ అయ్యే పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. సర్వీసుకు 20 మార్కులు వెయిటేజి ఇచ్చినా ప్రయోజనం ఉండదన్నారు. గత 20 సంవత్సరాలుగా వీరంతా పనిచేస్తున్నారని, గతంలో డీఎస్సీ ద్వారా రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్, మెరిట్ ప్రకారం ఎంపికై విధులు నిర్వర్తిస్తున్నారని అన్నారు. మళ్లీ వీరిని పరీక్ష రాయమనడం న్యాయం కాదన్నారు. ఇప్పటికే చాలామంది ఏజ్ బార్ అయ్యిందన్నారు. వీరిని ఖాళీ పోస్టులలో సీనియారిటీ ప్రకారం రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. అప్పటివరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, ఉపాధ్యక్షుడు లింగాల చిన్నాన్న, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

ఓటర్లు నోటుకు ఓట్లు అమ్ముకోవద్దు



ఆసిఫాబాద్ : రానున్న ఎన్నికల్లో ఓటర్లు నోటుకు ఓట్లు అమ్ముకోవద్దని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రూప్నార్ రమేష్ అన్నారు. మండలంలోని దడ్పాపూర్ గ్రామంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటర్లు డబ్బుకు, మద్యానికి ఓట్లు అమ్ముకోకూడదని అలా చేస్తే ఐదు సంవత్సరాలు బానిసల్లా బతకాల్సి ఉంటుందన్నారు. అందరం సంగటితమై సరైన నాయకున్ని ఎన్నుకోవాలని అన్నారు. అభివృద్ధి చేయకుండా కేవలం ఓట్ల కోసం వచ్చే రాజకీయ నాయకులని నిలదీయాలని అన్నారు. బీసీలకు రానున్న ఎన్నికల్లో సాధ్యమైన ఎక్కువ సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాలి సంఘం జిల్లా అధ్యక్షుడు నగోసే శంకర్ పటేల్, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వైరగడే మారుతి పటేల్, బీసీ యువజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మారుతి, మండల అధ్యక్షుడు సిరికొండ సాయికృష్ణ పాల్గొన్నారు.

ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తాంసి : ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ఒక బాధ్యతగా భావించాలని భీంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నిఖిల్ రాజ్ అన్నారు. శుక్రవారం ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాలలో డ్రైడే" సందర్భంగా ర్యాపిడ్ ఫీవర్ సర్వే పరిశీలన జాతీయ కీటక జనిత నియంత్రణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా ఇండ్ల సందర్శణలు చేసి, దోమలు పుట్టకుండా-కుట్టకుండా ఉండేందుకు తగు ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలకు ఆరోగ్య సమస్యల నివారణకు ప్రజలకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచినీటి నిల్వలపై మూతలను ఉంచాలని, పూలకుండీలలో, పెంకులలో, కొబ్బరి బోండాలలో, ఇతరత్రా నిరంతరం ఉపయోగంలోలేని, నిరుపయోగంగా ఉన్న కుండలలో, టైర్లలలో ఉన్న లార్వ నీటిని తీసివేయాలని అన్నారు. దోమలు కుట్టడంతో మలేరియా, బోధకాలు, డెంగ్యూ, చికెన్ గున్యా, మెదడువాపు రావడం జరుగుతుందని అన్నారు. రాకుండా ఉండేందుకు పై ముందు జాగ్రత్తలతో పాటు, కిటికీలకు జాలీలను ఏర్పాటు చేసుకోవాలని, శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే దుస్తులను ధరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విస్తీర్ణాధికారి లింగంపల్లి జ్ఞానేశ్వర్, కె.లూసి, బి.గంగాధర్, ఆరోగ్య కార్యకర్తలు సరస్వతి, సుజాత, లచ్చుబాయి, అన్ని గ్రామాల ఆశాకార్యకర్తలు స్వప్న, మీర, సాజిద, అనుసూయ ఉన్నారు.

నేడు నిర్మల్‌కు బండి సంజయ్ రాక

నిర్మల్ : మాస్టర్ ప్లాన్ రద్దుపై బీజేపీ నాయకుడు మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు సంఘీభావం తెలపడానికి జాతీయ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ పార్లమెంటు సభ్యులు బండి సంజయ్ వస్తున్నట్టు బీజేపీ నాయకులు తెలిపారు. ఈ మేరకు ఉమ్మడి అదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న బీజేపీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, నిర్మల్ రైతులు పెద్ద ఎత్తున రావాలని నాయకులు కోరారు.

క్షీణిస్తున్న ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోగ్య పరిస్థితి

నిరాహార దీక్ష చేపట్టి మూడు రోజులు దాటుతున్న సందర్భంగా నిరసించిన మహేశ్వర్‌రెడ్డికి డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించారు. మహేశ్వర్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితి గంట గంటకు క్షీణిస్తుందని వైద్యులు పేర్కొనడం గమనార్హం.

ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా సమీకృత కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో శుక్రవారం బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 373వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పాపన్నగౌడ్ తెలంగాణ శివాజీ అని, దాదాపు 300 సంవత్సరాల క్రితమే వెనకబడిన వర్గాల కోసం పోరాడిన గొప్ప మహావీరుడన్నారు. బహుజనులు, అట్టడుగు అణగారిన వర్గాల సంక్షేమానికి చేసిన సేవలు గుర్తించి ప్రభుత్వం అధికారికంగా జయంతిని నిర్వహిస్తోందన్నారు. అదేవిధంగా పాపన్న గౌడ్ నిర్మించిన కోటలను రక్షిస్తుందని, ముందు తరాలకు తన చరిత్రను తెలియడానికి ఇలాంటి గొప్ప కార్యక్రమాలు నిర్వహించుకోవడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో బిసి వెల్ఫేర్ జిల్లా అధికారి రాజేశ్వర్‌గౌడ్, మున్సిపల్ ఛైర్మన్ గండ్రత్ ఈశ్వర్, జిల్లా గౌడ సంఘం నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ : సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం బీఎస్‌పీ ఆధ్వర్యంలో ఆయనకు నివాళులు అర్పించారు. బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమీందార్లు, జాగీర్దార్లకు వ్యతిరేకంగా వీరోచిత పోరాటం చేసి బహుజన రాజ్యం కోసం పాపన్నగౌడ్ కృషి చేశారని కొనియాడారు. ఆయన స్ఫూర్తిగానే తాము బహుజన రాజ్యాధికార యాత్ర చేపట్టినట్లు తెలిపారు. 272 రోజులు, 40 వేల కిలోమీటర్లు, రెండు వేల పైచిలుకు గ్రామాలలో ఈ యాత్ర చేపట్టి బహుజన రాజ్య స్థాపన కోసం కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్‌పీ రాష్ట్ర కార్యదర్శి సిడం గణపతి, కార్యనిర్వాహక కమిటీ రాష్ట్ర కార్యదర్శి అర్షద్‌హుస్సేన్, నాయకులు పాల్గొన్నారు.

బెజ్జూర్ : మండల కేంద్రంలో శుక్రవారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 373వ జయంతి వేడుకలను గౌడ సంఘం సభ్యులు ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం సభ్యులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు అందిస్తున్న బీసీబంధు మాదిరి గౌడ సంఘానికి కూడా అందజేయాలన్నారు. మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ, సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహాలకు ప్రభుత్వ భూమి కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షుడు జిల్లల సుధాకర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు ఒల్లల నాగభూషణ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి కార్తీక్ గౌడ్, ప్రచార కార్యదర్శి కొండ రవీందర్‌గౌడ్, ఉద్యోగ సంఘం అధ్యక్షుడు ఒల్లల అశోక్‌గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు గట్టు తిరుపతిగౌడ్, గౌడ సంఘం సభ్యులు రంగు సురేష్, దొమ్మటి తిరుపతిగౌడ్, జక్కుల సుధాకర్‌గౌడ్, తిరుపతిగౌడ్, రమేష్‌గౌడ్, ఒల్లల శరత్‌గౌడ్ పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : ఎంపీడీఓ కార్యాలయంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ డుబ్బుల నానయ్య మాట్లాడారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు వెంకన్న, ఎంపిడిఓ సత్యనారాయణగౌడ్, ఎంపిఓ గోవర్ధన్‌సింగ్, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు నారాయణ, అడెపల్లి సర్పంచ్ సంతోష్‌గౌడ్ పాల్గొన్నారు.



కాగజ్‌నగర్ : నివాళులు అర్పిస్తున్న బీఎస్‌పీ నాయకులు

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

- సెంట్రల్ బృందం సభ్యులు డాక్టర్ సంధ్యాసింగ్, డాక్టర్ ఈశ్వరి



నవతెలంగాణ - కౌటాల

మారుమూల గ్రామాల ప్రజలకు మరింత మెరుగైన ప్రభుత్వ వైద్యసేవలు అందించి, ప్రజలకు నమ్మకం కలిగేలా చేయాలని కేంద్రం క్వాలిటీ బృందం సభ్యులు డాక్టర్ సంధ్యాసింగ్, డాక్టర్ ఈశ్వరి అన్నారు. శుక్రవారం జిల్లా పర్యటనలో భాగంగా గుండాయిపేట్ ఉపకేంద్రాన్ని తనిఖీ చేశారు. జాతీయ ఆరోగ్య మిషన్ కింద చేపడుతున్న హెల్త్ స్కీంలతో పాటు రాష్ట్రం చేపట్టిన వైద్యసేవలు ప్రజలకు ఏ విధంగా అందుతున్నాయో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల ప్రజలకు ప్రభుత్వ వైద్యసేవలు అందించి నమ్మకం ఉండేలా చూడాలని వైద్య సిబ్బందికి సూచించారు. కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న మిషన్ ఇంద్రధనస్సు, టీబీ కంట్రోల్, నట్టల నివారణతో పాటు సాధారణ ప్రసవాలు, మాతాశిశు మరణాల నియంత్రణ రికార్డులను పరిశీలించి నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ సీతారాం నాయక్, జిల్లా టీబీ కంట్రోల్ అధికారి సునీల్‌రావు, కౌటాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి నవత, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పోరాటాల రూపకల్పనకే సీఐటీయూ మహాసభలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కార్మికుల సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో చేపట్టబోయే పోరాటాలకు రూపకల్పన చేసేందుకు ఈ నెల 27న కాగజ్‌నగర్‌లో నిర్వహించే సీఐటీయూ జిల్లా ప్రథమ మహాసభలు వేదికగా నిలుస్తాయని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మహాసభల విజయవంతం కోసం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి నేటి వరకు 73 షెడ్యూల్డు పరిశ్రమలలో జీఓలను సవరించలేదని, పాత జీఓలో నేటికీ అమలవుతున్నాయని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు ఇపుడు పోరాటాల బాట పడుతున్నారన్నారు. పంచాయతీ కార్మికులు 36 రోజులకు పైగా సమ్మె చేశారని, ఇప్పుడు రెండో ఎఎన్ఎంలు సమ్మె చేస్తున్నారని అన్నారు. రెండో ఎఎన్ఎంల సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజులలో తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు సమ్మె చేపట్టేందుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఆర్ త్రివేణి, ఉపాధ్యక్షులు ముంజం ఆనంద్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యులు కృష్ణమాచారి, ఎన్ పద్మ, స్వరూప, భాగ్య, పంచశీల, శోభ, లక్ష్మి పాల్గొన్నారు.

బీనామీ పేర్లతో మంత్రి భూముల కబ్జా

- మంత్రి సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధంగా ఉండాలి
- దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు



నవతెలంగాణ-నిర్మల్

బీనామీ పేర్లతో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి భూములు కబ్జా చేస్తున్నారని, దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు ఆరోపించారు. నిర్మల్ మాస్టర్ ప్లాన్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తన నివాసంలో చేపట్టిన ఆమరణ నిరహార దీక్షకు దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిర్మల్ నుంచి మొదలు పెడితే హైదరాబాద్‌లోని గచ్చిబౌలి వరకు మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, తన కుటుంబ సభ్యులు, బినామీల పేర్లతో భూములు కబ్జా చేశారని ఆరోపించారు. న్యాయ శాఖ మంత్రి అయిన ఇంద్రకరణ్ రెడ్డి సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణకు సిద్ధం కావాలని అన్నారు. ఉద్యమాల గడ్డగా పేరొందిన నిర్మల్ గడ్డ మహేశ్వర్‌రెడ్డి చేపట్టిన ఈ ఉద్యమం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు విజృంభిస్తోందని అన్నారు. గతంలో కామారెడ్డిలో ఇలాగే అక్కడి అధికార పార్టీ నాయకులు అడ్డగోలుగా జోన్‌లను రూపొందిస్తే ప్రజా పోరాటంతో, రైతులందరూ ఏకమై దాన్ని రద్దు చేసే వరకు కృషి చేశామని గుర్తు చేశారు. మంత్రి నీతివంతుడైతే సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణకు సిద్ధమా అని సవాల్ విసిరారు. నిర్మల్ నుంచి మొదలు పెడితే హైదరాబాద్‌లోని గచ్చిబౌలి వరకు మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తమ బంధువుల బినామీల పేర్లతో ఉన్న భూముల విలువలు పెంచుకోవడానికి మార్చిన జీఓలను గుట్టు భయట పెట్టమంటారా అని హెచ్చరించారు. గతంలో సోఫీనగర్‌లో ఇండస్ట్రియల్ జోన్ కోసం సేకరించిన భూములను తిరిగి రైతులకు అప్పజెప్పాలని అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం సేకరించిన భూములను ఆ అవసరాలకు వాడకుండా ప్రభుత్వం వేరే ఇతర వాటికి వాడితే, ఆ భూములను తిరిగి ఏ రైతు దగ్గర సేకరించామో ఆ రైతుకు తిరిగి అప్పజెప్పాలని ఆదేశించిందని అన్నారు. మంత్రికి చిత్త శుద్ధి ఉంటే సోఫీనగర్‌లో కంపెనీలు పెట్టలేనందున తిరిగి ఆ భూములను రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంజులాపూర్, తల్వెద గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురయ్యే విధంగా ఉన్న మాస్టర్ ప్లాన్ ను మంత్రి తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అయ్యన్నగారి భూమయ్య, రావుల రాంనాథ్, సాదం అరవింద్, సామ రాజేశ్వర్‌రెడ్డి, మెడిసెమ్మ రాజు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మహిళ సర్పంచ్ మృతి

నవతెలంగాణ-నార్నూర్



గాదిగూడ మండలంలోని కొత్తపెల్లి-జి సర్పంచ్ కొట్నాక్ జారుబాయి శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. నాలుగు నెలల నుండి అనారోగ్యంతో బాధ పడుతోంది. జిల్లా కేంద్రంలోని రిమ్స్‌తో పాటు హైదరాబాద్‌తో చికిత్స తీసుకున్నారు. అయినా ఫలితం లేకుండా పోయిందని భర్త కొట్నాక్ బారిక్‌రావ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపిపి అడ చంద్రకళ రాజు, దళిత హక్కుల సాధన సమితి మండల అధ్యక్షుడు శేఖర్ నివాళులు అర్పించారు. ఉపసర్పంచ్ మురాజి, కార్యదర్శి పెందూర్ ముకేష్, గ్రామ పెద్దలు కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

21 నుండి 28 వరకు పలు రైళ్ల రద్దు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాజీపేట-బల్లార్షా సెక్షన్‌ల మధ్య నడిచే పలు రైళ్లను ఈ నెల 21వ తేదీ నుండి 28 వరకు రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైల్వే ట్రాక్ మరమ్మత్తుల కారణంగా ఈ రైళ్లను రద్దు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

రద్దు చేసిన రైళ్లు ఇవే

17003	కాజీపేట- సిర్పూరు టౌన్ (రామగిరి) 21 నుండి 27 వరకు
17004	బల్లార్షా-కాజీపేట (రామగిరి) 21 నుండి 27 వరకు
17033	భద్రాదలంరోడ్-బల్లార్షా (సింగరేణి) 22 నుండి 28 వరకు
17034	సిర్పూరు టౌన్-భద్రాచలంరోడ్‌సింగరేణి 21 నుండి 27 వరకు
07766	సిర్పూరు-కరీంనగర్(పుష్‌పుల్) 21 నుండి 27 వరకు
07765	కరీంనగర్-సిర్పూరు టౌన్ (పుష్‌పుల్) 22 నుండి 28 వరకు
17035	కాజీపేట-బల్లార్షా (బల్లార్షా ఎక్స్‌ప్రెస్) 21 నుండి 27 వరకు
17036	బల్లార్షా-కాజీపేట (కాజీపేట ఎక్స్‌ప్రెస్) 22 నుండి 28 వరకు

ఫిర్యాదుతో హద్దులు కేటాయించిన రెవెన్యూ అధికారులు

నవతెలంగాణ-నస్పూర్

మున్సిపాలిటీలోని 64 సర్వే నెంబర్‌లో గల భూమి కబ్జాకు గురవుతుందని ఇటీవల ఆయుష్ వైద్యాధికారులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ మాంతయ్య ఆధ్వర్యంలో హద్దులు కేటాయించినట్లు ఆయుష్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ రవి నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఆయుష్ వైద్యశాలకు నాలుగు గంటల భూమిని అధికారులు కేటాయించారని తెలిపారు. ఇకముందు ఆయుష్ వైద్యశాలకు కేటాయించిన భూమిని కబ్జాకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. అంతేకాకుండా ప్రధాన మంత్రి నిధులతో ఆయుష్ హాస్పిటల్ ను అభివృద్ధి చేస్తున్నామని, జిల్లా ఉన్నతాధికారులు సహకరించి 30 నుండి 40 గుంటల వరకు భూమిని కేటాయిస్తే దాదాపు రూ.15 కోట్లతో ఇంటిగ్రేటెడ్ ఆయుష్ హాస్పిటల్‌ను ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ ఆయుష్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మజ, జన్నారం మెడికల్ ఆఫీసర్ నారాయణ, మందమర్రి మెడికల్ ఆఫీసర్ నీరజ పాల్గొన్నారు.

గిరిజనులకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం



నవతెలంగాణ-జన్నారం

గిరిజనులకు బిఆర్ఎస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఆ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ నాయకులు భూక్య జాన్సన్ నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని దొంగపల్లి, అలీనగర్ గిరిజన గ్రామాలలో పర్యటించి గిరిజనుల జీవన స్థితిగతులను తెలుసుకున్నారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలిచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమే అన్నారు. రైతులకు రూ.లక్ష వరకు రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. బీఆర్ఎస్‌ను మరోసారి అధికారంలోకి తేవడానికి గిరిజనులు సహకరించాలని కోరారు. మీకు ఎలాంటి సమస్యలు వచ్చిన తన దృష్టికి తీసుకురావాలని అన్నివేళలా అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాన్సన్ నాయక్ యువసేన సభ్యులు ఫజల్ ఖాన్, జక్కుల సురేష్, రాగుల వెంకటేష్, చిదర్ల రమేష్, కంద్రపు మల్లేష్, రాజు, నవీన్, ఆంజనేయులు సురక్షన్ బండారి రమేష్ రాజన్న, మల్యాల సర్పంచ్ హనుమంతరావు, మాజీ సర్పంచ్ పోచన్న పాల్గొన్నారు.

డాడీస్ రోడ్డు వాహన సురక్షిత యాప్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రోడ్డుపై జరిగే ప్రమాదాల నుండి అత్యవసర సేవలు పొందడానికి రూపొందించిన డాడీస్ రోడ్డు వాహన ఆప్‌ను శుక్రవారం జడ్పీటీసీ నాగేశ్వరరావు నిర్వాహకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ఈ యాప్ అవసరమైన సేవలు అందిస్తుందన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ డాడీస్ రోడ్ డెకల్ వెహికల్ సేఫ్టీ క్యూ ఆర్ కేవలం 599 జీవితకాలం వాలిడిటీ పొందవచ్చన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే యాప్ స్కాన్ చేస్తే కుటుంబ సభ్యులకు సమాచారం వెళ్ళిపోతుందని తెలిపారు. ప్రతి ఒక్కరు తమ మొబైల్ లో ఆప్ డౌన్ లోడ్ చేసుకొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాడీస్ రోడ్ సంస్థ ఆసిఫాబాద్ నిర్వాహకులు మడావి సతీష్, డిస్ట్రిబ్యూటర్స్ లక్ష్మణ్, నగేష్, వెంకటేష్, కాంతారావు పాల్గొన్నారు.

ఖాళీ సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని తెలంగాణా సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఖాళీగా ఉన్న మూడు సీట్లకు నేడు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనాథ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీసీలో ఎస్సీలకు ఒక సీటు, బైపీసీలో ఓసీలకు ఒక సీటు, మైనార్టీలకు ఒక సీటు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తిగలవారు ధ్రువీకరణ పత్రాలతో నేడు సాయంత్రంలోగా కళాశాలలో నేరుగా సంప్రదించాలని పేర్కొన్నారు.